సాక్షి కామారెడ్డి

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



ఘనంగా పొలాల అమావాస్య

జిల్లాలో శనివారం ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. ఎడ్లతో ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

- 8లో ▸



దివ్యాంగులను మోసం చేస్తున్నారు

హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆరోపించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.6 /21.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

13న జాతీయ లోక్ అదాలత్



కామారెడ్డి టౌన్ : జాతీయ లోక్ అదాలత్‌ను వచ్చేనెల 13న నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ తెలిపారు. శనివారం కోర్టు హాల్‌లో పోలీసులు, న్యాయమూర్తులు ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీకి వచ్చే క్రిమినల్, వైవాహిక తగాదాలు, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్, బ్యాంకు రికవరీ తదితర కేసులను వీలైనంత ఎక్కువ పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రెటరీ ఈటి సుమలత, ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత్ రావు, సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవరెడ్డి, ఎస్సై మురళి, జిల్లా కోర్టు ఏవో లక్ష్మీకాంత్, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఖాజా సమీ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్ : రేషన్ షాప్‌ల ద్వారా సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఒకటో తేదీన ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని జూన్‌లో ఒకేసారి అందించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్‌లో మాత్రం ఒకే నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు.

'సాగర్' గేట్లు మూసివేత



నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో శనివారం మధ్యాహ్నం నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను మూసి వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఈనెల 18 నుంచి శనివారం ఉదయం వరకు ఆరు రోజుల పాటు నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ నెలలో కురిసిన వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల నుంచి 40.70 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ఆరు రోజుల్లో 27.151 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి విడుదల చేశామన్నారు. శనివారం సాయంత్రం 13,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,404 అడుగుల (16.357 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

'బోర్డులు తప్పనిసరి'

బీబీపేట: ఫర్టిలైజర్ దుకాణాలకు, గోదాములకు బోర్డులు తప్పనిసరిగా ఉండాలని డీఏవో మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన బీబీపేటలోని ఫర్టిలైజర్ దుకాణాలు, గోదాములను సందర్శించారు. వాటికి ఎలాంటి బోర్డులు లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోగా బోర్డులు పెట్టాలని, లేకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తానని దుకాణాదారులను హెచ్చరించారు. ఇ–పాస్ యంత్రం ద్వారానే ఎరువులు పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట ఏడీఏ అపర్ణ, ఏవో నరేందర్, ఏఈవోలు రాఘవేంద్ర, సంతోష్, రాజేష్ ఉన్నారు.

'పారదర్శకంగా ఆడిటింగ్ నిర్వహిస్తున్నాం'

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులలో ఆడిటింగ్‌ను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూస్తామని, స్వయంగా ప్రతి సీహెచ్‌సీని సందర్శిస్తానని తెలిపారు. ఆడిటింగ్ సిబ్బందికి వైద్య సిబ్బంది సహకరించాలని సూచించారు.

పట్టు పట్టి.. పీహెచ్‌డీ సాధించి..

- కుటుంబం, ఉద్యోగ బాధ్యతలు మోస్తూనే పరిశోధనలు
- సమాజానికి మేలు చేసే అంశాలతో..
- డాక్టరేట్ పట్టా అందుకున్న మహిళా'మణులు'



ఓవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూ.. మరోవైపు ఉద్యోగం చేస్తూ.. ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసి విజయం సాధించారు ఆ మహిళామణులు. తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు తెలంగాణ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో తాము ఎంచుకున్న అంశంపై పరిశోధనలు చేశారు. ఇటీవల యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాలను అందుకున్నారు.

- సాక్షి ప్రతినిధి, కామారెడ్డి





'పోక్సో'పై బాలికల అవగాహన స్థాయి అంశంపై...



కామారెడ్డి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీవో)గా పనిచేస్తున్న స్రవంతి తెయూలో పీహెచ్‌డీ చేశారు. పోక్సో చట్టంపై జిల్లా లోని కౌమార బాలబాలికలకున్న అవగాహన స్థాయిని అధ్యయనం చేసి పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ సోషల్ వర్క్ విభాగంలో విజయ్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో ఆమె పరిశోధన సాగింది. ఇటీవల జరిగిన తెయూ స్నాతకోత్సవంలో ఆమె డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

మహిళలపై సీరియల్స్ ప్రభావం..



వామపక్ష విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని ఉన్నత విద్యాభ్యాసం చేసిన పిట్ల సరిత.. తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె 'మహిళలపై టెలివిజన్ సీరియల్స్ ప్రభావం' అంశంపై పరిశోధన చేశారు. ఇటీవలే డాక్టరేట్ సాధించారు.

మొక్కజొన్న ఎదుగుదల..



నిజామాబాద్ జిల్లా మునిపల్లిలోని మహాత్మా జ్యోతీబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అనూష పరుచూరి.. మొక్కజొన్నపై బ్రాసినో స్టెరాయిడ్స్, కేడ్మియం లవణీయత చూపే ప్రభావం అంశంపై పరిశోధన చేశారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుంటూ, చదువుకుంటూ ఉన్నతంగా ఎదుగుతున్నారు.

తెలంగాణ నవలా రచయిత్రులు..



తెయూ సౌత్ క్యాంపస్‌లో పార్ట్‌టైం లెక్చరర్‌గా పనిచేస్తున్న సయ్యద్ అఫ్రీన్ బేగం మాతృభాష ఉర్దూ. ఆమె తెలుగులో మంచి ప్రావీణ్యం కలిగి ఉన్నారు. తెయూ తెలుగు అధ్యయన విభాగంలో 'తెలంగాణ నవలా రచయిత్రులు.. ఒక పరిశీలన' అన్న అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు.

తెలంగాణ సాహిత్యం-శ్రామిక జీవన చిత్రణ..



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కాలేజీలో తెలుగు విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఎస్.శమంత తెలుగు సాహిత్యంపై పట్టు సాధించారు. నిరంతర అధ్యయనం ద్వారా తాను ఎంచుకున్న రంగంలో రాణిస్తున్నారు. తెలంగాణ సాహిత్యం–శ్రామిక జీవన చిత్రణ అన్న అంశంపై తెయూలో పీహెచ్‌డీ చేశారు.

వ్యవసాయంపై ప్రపంచీకరణ ప్రభావం..



నిజామాబాద్‌కు చెందిన ఎస్.సౌందర్య ప్రస్తుతం సిద్దిపేట ప్రభుత్వ పీజీ కళాశాలలో పార్ట్‌టైం అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. వ్యవసాయంపై ప్రపంచీకరణ ప్రభావం –తెలంగాణ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలపై ఒక అధ్యయనం అన్న అంశంపై పరిశోధన చేశారు. ఇటీవలే డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

తెలంగాణలో పెట్టుబడి అవకాశాలు, సవాళ్లు..



తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో నిజామాబాద్ జిల్లా దాస్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.సరిత.. 'తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు, సవాళ్లు, ఒక అధ్యయనం' అన్న అంశంపై పరిశోధన చేశారు. తెయూ ప్రొఫెసర్ యాదగిరి పర్యవేక్షణలో పరిశోధన సాగింది. ఇటీవల పట్టా అందుకున్నారు.

'నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి'



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర, వేదికపై అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీలు

కామారెడ్డి క్రైం : వినాయక నవరాత్రులు, నిమజ్జనోత్సవ శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. గణేశ్ మండపాల నిర్వాహకులతో శనివారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మండపాల ఏర్పాటు, నిర్వహణ విషయంలో నిర్వాహకులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. తప్పనిసరిగా పోలీసు శాఖ సూచించిన విధంగా ఆన్‌లైన్ ద్వారా వివరాలు సమర్పించి అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిబంధనలకు లోబడి కార్యక్రమాలు జరపాలని, పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసులకు వలంటీర్లు సహకరించాలని పేర్కొన్నారు. మండపాల్లో ఏదైనా బ్యాగులు, ప్లాస్టిక్ కవర్లు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100 డయల్‌కు గానీ, స్థానిక పోలీసులకు గానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ షాక్‌లు జరుగకుండా నిపుణులైన ఎలక్ట్రీషియన్‌లతో ఏర్పాట్లు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, రవాణా, ఎక్సైజ్ శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

పోలీసు పహారాలో పంపిణీ

మాచారెడ్డి : యూరియా కోసం శనివారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి రైతులు భారీగా తరలివచ్చారు. దీంతో పోలీసుల పహారాలో పంపిణీ చేశారు. విండోలో 450 బస్తాల యూరియా ఉండగా.. దానిని రైతులకు అందించారు. సాయంత్రం చీకటి పడే వరకు పంపిణీ కొనసాగింది. కాగా యూరియా కోసం రైతులు గొడవకు దిగగా.. జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, కామారెడ్డి ఏడీఏ అపర్ణ అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

బీబీపేటలో..

బీబీపేట: మండలకేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి శనివారం 440 బ్యాగ్‌ల యూరియా వచ్చింది. రైతులు ఉదయమే కార్యాలయం వద్దకు చేరుకుని బారులు తీరారు. ఒక్కో రైతుకు ఒక బ్యాగ్ చొప్పున ఇచ్చారు. ఎరువుల పంపిణీని డీఏవో మోహన్‌రెడ్డి పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అవసరానికి మించి యూరియా వాడడం వల్లే కొరత ఏర్పడుతోందన్నారు. రైతులు నానో యూరియా వాడాలని సూచించారు.



మాచారెడ్డిలో యూరియా పంపిణీని పర్యవేక్షిస్తున్న పోలీసు



బీబీపేట సహకార సంఘం వద్ద బారులు తీరిన రైతులు



మాచారెడ్డిలో లైన్‌లో ఉన్న రైతులు

మోసానికి గేట్‌వే!

మోసగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. అమాయకులకు వల వేస్తూ.. చిక్కినవారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. అద్దెకు తెచ్చిన కార్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తూ.. ఆపై అదే కారును ఎత్తుకెళ్లి మోసాలకు పాల్పడుతున్న ముఠాను ఇటీవల జిల్లా పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గే యాప్స్ ద్వారా స్వలింగ సంపర్కులను ఆకర్షిస్తూ, నగ్న వీడియోలతో బ్లాక్ మెయిలింగ్ చేస్తున్న మరో ముఠా గుట్టు రట్టు చేసిన ఉదంతమూ విదితమే.. అయితే ఈ కేసులో వందలాది మంది బాధితులున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం సంచలనం సృష్టిస్తోంది.



- యాప్ ద్వారా స్వలింగ సంపర్కులకు వల
- నగ్న వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్
- రూ. లక్షలు వసూలు చేస్తున్న ముఠా
- ఇప్పటికే ఐదుగురు నిందితుల అరెస్ట్
- కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు ప్రయత్నాలు
- బాధితుల గురించి ఆరా తీస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గే యాప్స్ ద్వారా స్వలింగ సంపర్కులను ఆకర్షించి వారిని తమ దగ్గరకి రప్పించుకుని వారికి తెలియకుండా నగ్న వీడియోలు తీసి బ్లాక్ మెయిలింగ్ దందా నడిపిన ముఠా సభ్యులు ఐదుగురిని ఈనెల 2న కామారెడ్డిలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే వీరిపై ఇప్పటికే 11 కేసులు నమోదవగా.. బాధితులు నలభై మంది దాకా బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. ఇంకా వందల్లో ఉంటారని సమాచారం. బాధితుల్లో కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాలకు చెందిన వారూ ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా కొందరు బాధితులు తమ విషయం బయటకు పొక్కితే పరువు పోతుందన్న ఉద్దేశంతో బయటకు రావడం లేదు. మరికొందరు కుటుంబ సభ్యుల ముందు ఇబ్బందిపడొద్దని వెనకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఈ కేసులో స్థానిక పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రిమాండ్‌లో ఉన్న ముఠా సభ్యుల కస్టడీ కోసం పిటిషన్ వేసి వారిని మరింత లోతుగా విచారించే అవకాశాలున్నాయి.

వివరాలు సేకరిస్తున్న పోలీసులు..

ఇప్పటికే ఐదుగురు సభ్యులు గల ముఠాను అరెస్టు చేసిన పోలీసులు.. కేసులో మరింత లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. ముందుగా బాధితుల వివరాలు సేకరించి వారి ద్వారా ఫిర్యాదులు తీసుకుని ఎంత నష్టపోయారన్న విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు యాభై మంది వరకు బాధితులను గుర్తించినట్లు సమాచారం. బాధితులు ఇంకా వందల్లో ఉంటారని భావిస్తున్నారు. కేసును మరింత లోతుగా విచారించేందుకు అరెస్టయిన వ్యక్తులను కస్టడీలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

వలువలు ఒలిచి.. ఖాతాలు కొల్లగొట్టి..

ఈ ముఠా సభ్యులు వివిధ యాప్‌ల ద్వారా స్వలింగ సంపర్కులను ఆకర్శిస్తారు. వారికి కామారెడ్డిలో తాము ఏర్పరచుకున్న స్థావరం లొకేషన్ పంపించి రప్పించుకుంటారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న గే.. వారిని రిసీవ్ చేసుకుని, సహకరిస్తూ బట్టలు విప్పించి న్యూడ్‌గా మారుస్తాడు. దీనిని ముఠా సభ్యులు ఫొటోలు, వీడియోలు రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడతారు. వచ్చిన వ్యక్తి దగ్గర ఉన్న డబ్బుల్ని లాక్కుంటారు. అతడి బ్యాంకు ఖాతాలో ఎన్ని డబ్బులు ఉన్నాయో చెక్ చేసి ఆ డబ్బునంతా తమకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటారు. కొందరిని తర్వాత కూడా ఫోన్ చేసి డబ్బులకోసం డిమాండ్ చేస్తున్నారని, లేదంటే న్యూడ్ వీడియోలు, ఫొటోలు బయటపెడతామని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిసింది. ఇలా ముఠా కార్యకలాపాలు నాలుగేళ్లుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల జిల్లాల నుంచే కాకుండా హైదరాబాద్‌కు చెందినవారు కూడా ఎంతో మంది వీరి వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నట్లు సమాచారం. అయితే బాధితులు బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని పోలీసులకు ఫిర్యాదులు చేయడానికి వెనుకాడుతున్నారు. ఓ బాధితుడు ధైర్యం చేసి పోలీసులకు వివరించడంతో ముఠా గుట్టు రట్టయ్యింది.

క్రమశిక్షణతో ముందుకెళ్లాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

భిక్కనూరు: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకెళ్తే బంగారు భవిష్యతును పొందవచ్చని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం ఆయన బస్వాపూర్‌ను సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా లబ్ధిదారులు వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని వ్యాధులకు సంబంధించిన మందులను నిల్వ ఉంచుకోవాలని సూచించారు. ప్రతి కాన్పు ప్రభుత్వాస్పత్రిలో జరిగేలా ప్రజలకు చైతన్య పరచాలన్నారు. అనంతరం ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. చదువుతో పాటు సామాజిక సేవలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సైన్స్ ల్యాబ్ వినియోగం, ప్రయోగాల గురించి ఆయన విద్యార్థుల ను ప్రశ్నించారు. సరైన సమాధానాలిచ్చిన విద్యార్థులకు నోటు బుక్కులను బహుమతిగా అందించారు. కార్యక్రమాలలో జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విద్య, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, వైద్యురాలు యెమీమా, హెచ్ఎం సబిత, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ తదతరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం మాకొద్దు

- కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మహిళల ధర్నా



బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కామారెడ్డి టౌన్ : ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని రద్దు చేయాలని పలువురు మహిళలు డిమాండ్ చేస్తూ శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాజ లలిత ఆధ్వర్యంలో కామారెడ్డి కొత్త బస్టాండ్ ఎదుట బస్సులు బయటకు వెళ్లే దారిలో బైఠాయించారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ఈ ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలతో పాటు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరిపడా బస్సులు లేక, కిక్కిరిసిన ప్రయాణికులతో ప్రయాణాలు చేయలేకపోతున్నామన్నారు. ఈ ఫ్రీ బస్సు పథకం వల్ల మహిళలను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం.. ఈ పథకం ద్వారా మహిళలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు, వృద్ధులకు ఈ పథకం అమలు చేయాలని కోరారు. ఈ ఉచిత పథకం వల్ల ధరలు పెంచుతూ మళ్లీ పేద, మధ్యతరగతి వారికే భారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నాగిరెడ్డిపేటలో 85 శాతం 'స్త్రీనిధి' రుణ బకాయిలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): స్త్రీనిధి రుణాలకు సంబంధించి నాగిరెడ్డిపేట మండలంలో 85శాతం బకాయిలు పేరుకుపోయాయని స్త్రీనిధి జిల్లా మేనేజర్ కిరణ్ తెలిపారు. మండలకేంద్రం గోపాల్‌పేటలో స్త్రీనిధి ద్వారా ఇవ్వనున్న సౌభాగ్య, ఐశ్వర్య రుణాలకు సంబంధించిన వ్యాపారాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2025–26ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా రూ.95కోట్లు రుణాలుగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. దీనిలో ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా రూ.30కోట్లు రుణాలుగా ఇచ్చామని ఆయన చెప్పారు. కాగా జిల్లాలో 50శాతం స్త్రీనిధి రుణబకాయిలుండగా వాటిలో నాగిరెడ్డిపేట మండలంలోనే 85శాతం రుణబకాయిలు పేరుకుపోయాయయని వివరించారు. బకాయిల వసూళ్ల కోసం ప్రతి మంగళవారం, గురువారం స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఐకెపీ సీసీ దత్తు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి



నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్–బోధన్ రహదారి విస్తరణ పనులకు రైతులు సహకరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. రహదారికి ఇరువైపులా భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. మహమ్మద్ నగర్ మండల తహశీల్ కార్యాలయంలో శనివారం ఆమె మహమ్మద్ నగర్, బూర్గుల్, గున్కుల్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. రహదారికి భూములు ఇవ్వాలని, విస్తరణ పనులను ఆపవద్దన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, స్థానిక విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తహసీల్దార్ సవాయిసింగ్, డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్, హెచ్‌ఎం మధుసూదన్‌రాజ్, గిర్దావర్ పండరి ఉన్నారు.

మద్యం పాలసీలో 25శాతం రిజర్వేషన్ కల్పించాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ మద్యం పాలసీలో గౌడ కులస్తులకు 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా 25శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామంలో ఈత వనాలను పెంచడానికి 10 ఎకరాలను కేటాయించాలన్నారు. సాయాగౌడ్, రవీందర్‌గౌడ్, రాజు,రమేష్ తదితరులున్నారు.

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య



బేగంపూర్‌లో హనుమాన్ ఆలయం చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా శనివారం ఎడ్ల పొలాల అమావాస్య పండుగను అన్నదాతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లో రైతులు ఎడ్లను శుభ్రంగా కడిగి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను ఎడ్లకు తినిపించారు. అనంతరం సాయంత్రం వేళ స్థానిక ఆలయాల చుట్టూ అన్నదాతలు ఎడ్లతో ప్రదక్షిణలు చేయించారు.



బాన్సువాడలో..



గాంధారి మండలంలో ..



సదాశివనగర్‌లో ఎడ్లకు పూజలు నిర్వహిస్తున్న అన్నదాతలు..



తాడ్వాయిలో..



ఉగ్రవాయిలో..

దివ్యాంగులను మోసం చేస్తున్న సీఎం

బాన్సువాడ: ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అన్నారు. బీర్కూర్‌లో శనివారం నిర్వహించిన మహాగర్జన సన్నాహక సభకు ఆయన హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి దివ్యాంగుల పింఛన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచుతామని హామీ ఇచ్చి గద్దె ఎక్కగానే దివ్యాంగులను చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. అధికారంలో ఉన్న వారిని నిలదీయాల్సిన ప్రతిపక్షంలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే మహా గర్జనకు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంథని సామిల్, దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా నాయకులు కుమ్మరి సాయిలు ఉన్నారు.



బీర్కూర్‌లో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

పెన్షన్లను పెంచాలి..

ఎల్లారెడ్డిరూరల్: ఆసరా, వికలాంగులు, వితంతువుల పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎల్లారెడ్డిలో శనివారం నిర్వహించిన పెన్షన్‌దారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆదిమూలం సతీష్, ప్రవీణ్ తదితరులున్నారు.

సోషల్‌వర్క్‌లో ప్రగతికి డాక్టరేట్



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని సోషల్‌వర్క్ డిపార్ట్‌మెంట్‌లో రీ సెర్చ్ స్కాలర్ ప్రగతికి శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ రాజేశ్వరీ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ఆటిట్యూడ్ ఎమాంగ్ స్టూడెంట్స్ టువర్డ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ కేరీర్ ప్లానింగ్ ఇన్ కేజీబీవీస్ నిజామాబాద్' అనే అంశంపై సీహెచ్. ప్రగతి పరిశోధన చేసింది. ప్రగతి నిజామాబాద్ సోషల్ వేల్ఫేర్ గురుకుల కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తోంది. కార్యక్రమంలో ఓయూ సీనియర్ ప్రొఫెసర్ ఫ్రాన్సిస్, తెయూ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, సోషల్‌వర్క్ హెచ్‌వోడీ అంజయ్య, గైడ్ సూపర్‌వైజర్ రాజేశ్వరీ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో బోధించాలి





పెద్దకొడప్‌గల్‌లో టీఎల్‌ఎం మేళాలో బోధన సామగ్రిని ప్రదర్శిస్తున్న టీచర్లు.. గర్గుల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉపాధ్యాయులు ఆధునిక పద్ధతుల్లో బోధన సామగ్రిని వినియోగిస్తూ పాఠాలు బోధించాలని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బోధన అభ్యసన సామగ్రి (టీచింగ్ లర్నింగ్ మెటీరియల్–టీఎల్‌ఎం) మేళా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తమ తమ సామగ్రిని ప్రదర్శించారు. తహసీల్దార్ దశరథ్, జగదీష్, కిషోర్, హెచ్‌ఎం కమల, వల్లభరావు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళాతో బోధన సులభతరం

కామారెడ్డి రూరల్: విద్యార్థులకు సులభతరంగా బోధన చేయడానికి ఉపాధ్యాయ బోధనోపకరణాలు ఎంతో ఉపయోగపడుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో ఎల్లయ్య అన్నారు. కామారెడ్డి మండలం గర్గుల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం మండలస్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేళాలో ప్రతిభ కనబర్చిన వాటిని జిల్లాస్థాయిలో కూడా ప్రదర్శించి మొదటి బహుమతి వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అర్చన్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఎస్సీ, ఎస్టీ యూనియన్, టీపీటీఎఫ్, తపస్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో గత ఎన్నో ఏళ్ల నుంచి మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో సాక్షి దినపత్రికలో ఇటీవల 'మూడొందల మందికి ఒకే టాయిలెట్' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య వెంటనే పరిష్కరించాలని ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేశారు. 10 మరుగుదొడ్లకు రూ.6.90 లక్షలు నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ ప్రొసీడింగ్ జారీ చేశారు. పనులు ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో విద్యార్థులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సాక్షి దినపత్రికకు విద్యార్థులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుల రక్షణకో చట్టం

మీకు తెలుసా?



ఎల్లారెడ్డి: చిన్ననాటి నుంచి అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్య సమయంలో పిల్లలు భారంగా భావించి వదిలేస్తున్నారు. ఇలా దగ్గరి వాళ్లతో దగాపడ్డ తల్లిదండ్రులకు వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం –2007 రక్షణ కల్పిస్తోంది.

- చట్టం ప్రకారం పిల్లలు తమ తల్లిదండ్రులను పోషించేందుకు, వారికి అవసరమైన సహాయాన్ని అందించడానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- పిల్లలు నిర్లక్ష్యం చేస్తే తల్లిదండ్రులు వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవచ్చు. వారి నుంచి భరణం లేదా సంరక్షణావ్యయం పొందేందుకు న్యాయస్థానం తలుపుతట్టవచ్చు.
- తల్లిదండ్రులకు ఆహారం, బస, దుస్తులు, వైద్య సంరక్షణ వంటి ప్రాథమిక అవసరాలను కచ్చితంగా సమకూర్చాలి.
- పిల్లలు మానసికంగా లేదా శారీరకంగా హింసిస్తే కోర్టు నేరంగా పరిగణించి తల్లిదండ్రులకు న్యాయం చేస్తుంది. తల్లిదండ్రులను పోషించడంలో విఫలమైతే కోర్టు పిల్లలకు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తుంది.
- నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధుల కోసం కలెక్టర్, ఆర్డీవో, తహసీల్ కార్యాలయాలలో ప్రత్యేక సెల్‌లను ఏర్పాటు చేస్తున్నారు. బాధితులు తెల్లకాగితంపై తమ సమస్యను వివరిస్తూ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే అధికారులు విచారణ జరిపి వారికి పోషణ, సంక్షేమం వచ్చేలా చర్యలు తీసుకుంటారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి



గోపాల్‌పేట హైస్కూల్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్: సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో స్థానిక తహసీల్దార్లకు, బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలను అందజేశారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహాధర్నాకు జిల్లా నుంచి ఉపాధ్యాయులు, నాయకులు తరలివెళ్లారు.



మహాధర్నాకు తరలుతున్న టీచర్లు



తాడ్వాయి మండలం దేమికలాన్ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



లింగంపేటలో..



ధర్మారావ్‌పేట్‌లో..

రైతులు కెపాసిటర్లు అమర్చుకోవాలి



కోమట్‌పల్లిలో పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

లింగంపేట(ఎల్లారెడ్డి): రైతులు పొలాల్లో కెపాసిటర్లు అమర్చుకోవాలని, అవసరం ఉన్నవారు వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ విజయసారథి అన్నారు. ఇందుకోసం ఎలాంటి డబ్బులు చెల్లించనవసరం లేదన్నారు. మండలంలోని కోమట్‌పల్లి గ్రామంలో శనివారం ట్రాన్స్‌కో అధికారులు పొలంబాట కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పంటచేనుల్లో లూజ్ వైర్ లైన్లు, వంగిన పోల్స్‌ను సరిచేసినట్లు ఆయన తెలిపారు. అలాగే రైతులతో మాట్లాడారు. గ్రామంలో వినాయక ఉత్సవాల సందర్భంగా మండపాల్లో కరెంటు విషయంలో జాగ్రత్తలు పాటించాలని యువకులకు సూచించారు. ఏడీఏ మల్లేశం, సిబ్బంది అనిల్ కుమార్, మల్లయ్య, రాజు, పోశెట్టి, రాజు, రైతులు ప్రవీత్ పంతులు, శ్రీను, భీమయ్య, కళ్యాణ్, విఠల్, సాయిలు, హరీష్, కమ్లీ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లను సరిచేస్తున్నాం..

కామారెడ్డి అర్బన్: విద్యుత్ అధికారుల పొలంబాటలో ఇప్పటివరకు 1425 వదులుగా ఉన్న లైన్లను సరిచేశామని, 1384 వంగిపోయిన స్తంభాలు సరిచేసి వాటి మధ్యలో 1631 స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ఎన్‌పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో తక్కువ ఎత్తులో ఉన్న 161 లైన్ క్రాసింగ్, 84 డీటీఆర్ ప్లింత్‌లు, 95 డబుల్ ఫీడింగ్ పాయింట్లను మార్చినట్టు పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వినియోగదారులు సమస్యలు వచ్చినప్పుడు విద్యుత్‌శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించాలని సూచించారు.

బైక్ పైనుంచి పడి గాయాలు

ఎల్లారెడ్డి: పట్టణ శివారులో బైక్ పైనుంచి పడిన యువకుడికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు శనివారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని పోచాపూర్ గ్రామానికి చెందిన పండరి బైక్‌పై ఎల్లారెడ్డికి వస్తుండగా పట్టణ శివారులో రోడ్డుపై ఉన్న గుంతలో పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

'సాగర్'లో యువకుడి గల్లంతు



యువకుడి కోసం గాలిస్తున్న పోలీసులు



పండరి (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): పిట్లం మండలం అల్లాపూర్ గ్రామానికి చెందని గైని పండరి (30) శనివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులో గల్లంతయ్యాడని ఎస్సై శివకుమార్ తెలిపారు. ప్రాజెక్టు సందర్శన కోసం ద్విచక్ర వాహనంపై వచ్చిన పండరి గుల్‌దస్త్రా వద్ద జలాశయంలోకి దూకినట్లు పేర్కొన్నారు. యువకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

క్రైం కార్నర్

సీపీ ఎదుట 13 మంది బైండోవర్



బోధన్‌టౌన్(బోధన్): వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ, దుర్గామాత ఉత్సవాల సందర్భంగా బోధన్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైన 13 మందిని అదనపు జిల్లా మెజిస్ట్రేట్, సీపీ సాయిచైతన్య ఎదుట శనివారం బైండోవర్ చేశారు. వచ్చే ఆరు నెలలపాటు సత్ప్రవర్తన కలిగించేందుకు సొంత పూచీకత్తుతో బైండోవర్ చేసినట్లు సీపీ తెలిపారు. డీజే యజమానులు రూ.2 లక్షలు, డీజే ఆపరేటర్లు రూ.50 వేలు, ట్రబుల్ మాంగర్స్ రూ.లక్ష పూచీకత్తు చెల్లించినట్లు పేర్కొన్నారు. బైండోవర్ అయినవారు మళ్లీ నేరాలకు పాల్పడితే పూచీకత్తు డబ్బులను జప్తు చేస్తామన్నారు.

విద్యార్థిని ఇంటికి చేర్చిన పోలీసులు

ఆర్మూర్‌టౌన్: హాస్టల్‌లో ఉంటూ చదువుకోవడం ఇష్టంలేక బయటికి వచ్చిన విద్యార్థిని పోలీసులు క్షేమంగా ఇంటికి చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాల్కొండ మండలం బుస్సాపూర్ గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి బాల్కొండలోని వసతిగృహంలో ఉంటూ చదువుతున్నాడు. శనివారం ఇంటి నుంచి బయల్దేరిన విద్యార్థి హాస్టల్‌కు వెళ్లకుండా పెర్కిట్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్టాండ్‌లో రోదిస్తూ కూర్చున్న విద్యార్థిని గమనించిన స్థానికులు ఆరా తీయగా బస్సు కిందపడి ఆత్మహత్యకు పాల్పడేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సదరు విద్యార్థికి కౌన్సెలింగ్ చేసి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. సమయానికి బస్టాండ్‌కు చేరుకొని విద్యార్థి అఘాయిత్యానికి పాల్పడకుండా కాపాడిన శాంతికుమార్, దినేశ్‌లను ఎస్‌హెచ్‌వో అభినందించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్ గ్రామంలో ఓ వివాహిత శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. గ్రామానికి చెందిన వడ్డె పుష్ప(40) భర్త కిషన్, అతని కుటుంబసభ్యుల వేధింపులకు గురవుతూ వస్తుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది పుష్ప ఆత్మహత్యకు పాల్పడింది. భర్త, కుటుంబసభ్యుల వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం భర్త బతుకుదెరువు నిమిత్తం దుబాయిలో పనిచేస్తున్నాడు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

లైంగిక వేధింపుల నివారణకు కృషిచేయాలి



కామారెడ్డి టౌన్: పిల్లలు, మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్. వీఆర్‌ఆర్ వరప్రసాద్ సూచించారు. పట్టణంలోని జిల్లాకోర్టులో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నుంచి పిల్లల హక్కులు–రక్షణ అనే అంశంపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. పోక్సో చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. న్యాయమూర్తి సుమలత, ఏఎస్పీ నర్సింహారెడ్డి, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి స్రవంతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శేషు, సఖీ సెంటర్ ఇన్‌చార్జి కవిత, భరోసా కో–ఆర్డినేటర్, కవిత, చంద్రసేన్ రెడ్డి, ఖాజా పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలి



కామారెడ్డి టౌన్: ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని అధ్యాపకులు అన్నారు. పట్టణంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని నినాదాలు చేశారు. కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి అన్నారు. డీన్ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్‌లు గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణ శివారులో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులు తప్పకుండా చలాన్లు చెల్లించాలని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. ఎస్సై మహేష్, సిబ్బంది తదితరులున్నారు.

రెండేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి

- జిల్లా ఆస్పత్రికి తరలింపు



గాయపడ్డ చిన్నారి

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో శనివారం అల్లెపు అక్షర అనే రెండేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలై పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నారి అక్షర మధ్యాహ్నం తన ఇంటి ఎదుట ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. కుక్క దాడి చేస్తుండగా గమనించిన చిన్నారి అమ్మమ్మ కర్రతో ఎంత తరిమినా వదలకుండా చిన్నారిని కరవడంతో ముఖం, చెంప, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్సులో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్మూర్‌లో ఒకరికి..



గాయపడ్డ శ్రీనివాస్‌రావు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉదయం వాకింగ్‌కు వెళుతున్న శ్రీనివాస్‌రావు అనే వ్యక్తిని కుక్కలు వెంబడించాయి. దీంతో ఆయన జారిపడటంతో కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లగా ఎడమకాలు విరిగినట్లు బాధితుడు తెలిపారు.

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు..

- అనుమానంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవ
- మద్యం మత్తులో బండరాయితో దాడి.. భార్య మృతి



సాయవ్వ(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కలకాలం వెన్నంటి ఉండి కష్టసుఖాల్లో తోడుండాల్సిన భర్తే కాలయముడయ్యాడు. భార్యను బండరాయితో మోది హతమార్చిన ఘటన మండల కేంద్రంలోని జ్యోతినగర్ కాలనీలో శనివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. జ్యోతినగర్ కాలనీకి చెందిన చిందం లక్ష్మి అలియాస్ లింగవ్వ(40) వంట చేస్తుండగా భర్త రవి అతిగా మద్యం సేవించి గొడవపడ్డాడు. ఈ క్రమంలో భార్య, భర్తపై దాడి చేసింది. మద్యం మత్తులో ఉన్న రవి బండరాయితో తలపై దాడి చేయగా లింగవ్వ అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, అనుమానంతోనే ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవని కాలనీవాసులు తెలిపారు. మృతురాలికి కొడుకులు సురేశ్, మహేశ్ ఉన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై పుష్పరాజ్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.